నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 14 జూన్ 2025 | NIZAMABAD

## నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా
# వినయ్ కృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ



కంఠేశ్వర్, జూన్ 13 : నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా టి. వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4.45 గంటల ప్రాంతంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్లు సాదర స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్‌కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో తదితరులతో సమావేశమయ్యారు. జిల్లా స్థితిగతులు, స్థానిక పరిస్థితులపై వారితో చర్చించారు. అంతకుముందు కొత్త కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అదనపు కలెక్టర్లతోపాటు ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, అన్నిశాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్‌కు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు.

# మొహర్రం పండగకు నిధులు విడుదల చేయాలి

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పైసా నిధులివ్వలేదు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఎమ్మెల్సీ కవిత ఫోన్



ఖలీల్‌వాడి, జూన్ 13: షియా ముస్లింలకు అత్యంత పవిత్ర పర్వదినమైన మొహర్రం పండగకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో ఆమె శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం 2023లో మొహర్రం పండుగ నిర్వహణకు నిధులు విడుదల చేసిందని, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పైసా కూడా నిధులు ఇవ్వలేదని తెలిపారు. మొహర్రం పండగకు ఏనుగుపై ఊరేగింపు తీయడం షియా ముస్లింల సంప్రదాయమని గుర్తు చేశారు. 2024లో ఏనుగుపై ఊరేగింపు నిర్వహించేందుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని, ఇది షియా ముస్లింల మనసును గాయపర్చిందని వివరించారు. ప్రభుత్వం ఈసారి ఇలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎంత వైభవంగా సంప్రదాయబద్ధంగా మొహర్రం నిర్వహించిందో, ఈసారి కూడా అలాగే నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పందిస్తూ నిధుల విడుదల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని, మొహర్రంను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఆదేశాలు ఇస్తానని హామీనిచ్చారు.



**సగం దవాఖానలకు ఫైర్ సేఫ్టీ కరువు..**

నిజామాబాద్‌లో దాదాపు 400, కామారెడ్డి జిల్లాలో సుమారు 200 వరకు దవాఖానలు ఉన్నాయి. 10 నుంచి 100 పడకల సామర్థ్యం కలిగిన వైద్యశాలలు వెలిశాయి. కొన్ని కార్పొరేట్, ప్రైవేటు దవాఖానలు తప్ప చాలా వరకు నిబంధనలకు నీళ్లొదిలాయి. గల్లీల్లో దవాఖానలను ఎడాపెడా ఏర్పాటు చేశారు. భవన నిర్మాణం, అగ్ని ప్రమాద నివారణ చర్యలు, ఇతర అనుమతుల కోసం నగర పాలక సంస్థ, అగ్నిమాపక, వైద్యారోగ్య, పోలీస్ శాఖ నుంచి యాజమాన్యాలు అనుమతులు తీసుకోవాలి. ఆయా శాఖల్లోని కొందరు అధికారులు.. ఆయా దవాఖానలోని లొసుగులే అస్త్రంగా తీసుకుని వసూళ్లకు తెగబడుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ సమయంలో పక్కాగా తనిఖీలు చేసి అనుమతివ్వాలి. తొలుత 90 రోజులకు తాత్కాలికంగా పర్మిషన్ ఇవ్వాలి. నిబంధనల ప్రకారం నడుస్తున్నాయని భావిస్తే అయిదేండ్లకు పొడిగించాలి. కానీ ముడుపుల యావలో ఇవేమీ పట్టించుకోవడం లేదు. అగ్నిప్రమాద నివారణ చర్యలు అంతంతమాత్రమే. ఉమ్మడి జిల్లాలో వ్యాపార, వాణిజ్య భవనాలతోపాటు ప్రైవేటు దవాఖానలు సగానికి ఎక్కువ ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదంటే అనుమతుల జారీ ప్రక్రియ ఎంత లోపభూయిష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నామమాత్రంగా భద్రతా ప్రమాణాలు పాటిస్తుండడంతో ప్రమాదాలు జరిగితే అందులో పని చేసే కార్మికులు, ప్రజల ప్రాణాలు గాలిలో కలిసి పోయే ప్రమాదం పొంచి ఉన్నది.


ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలతోపాటు ప్రైవేట్ దవాఖానల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ఎంతవరకు సురక్షితంగా బయటపడే అవకాశాలు ఉన్నాయనే దానిపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇరుకు గదులు, రోడ్డుపైనే పార్కింగ్, కనీసం ఓ చిన్న వాహనం కూడా లోపలకు వెళ్లలేని విధంగా పెద్దపెద్ద భవనాలను నిర్మించడంతో అగ్నిప్రమాదాలు సంభవిస్తే నివారణ చర్యలు చేపట్టలేని పరిస్థితి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, ఫైర్ సేఫ్టీలేని వ్యాపార సముదాయాలను గుర్తించి చర్యలుచేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.
–నిజామాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# భద్రత గాలికి!

## వ్యాపార, వాణిజ్య భవనాలు, ప్రైవేట్ దవాఖానల్లో డొల్లతనం

- ఫైర్ సేఫ్టీపై తీవ్ర నిర్లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- ఇష్టారీతిన ఎడాపెడా అనుమతులు మంజూరు
- ప్రజల భద్రతను పట్టించుకోని సంబంధిత శాఖలు
- ప్రమాదం జరిగితే ప్రాణనష్టం నివారించే చర్యలు కరువు
- అగ్నిమాపక శాఖకు సవాల్‌గా మారిన 'పాత భవనాలు'

ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ షాపింగ్ మాల్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అగ్ని కీలలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది సుమారు 40గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. దట్టమైన పొగతో చుట్టు పక్కల ప్రాంతాల వాసులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు ఏవీ లేకపోవడంతో ఈ ప్రమాదంలో మంటలను అదుపు చేయడం కష్టతరమైంది. ఇటీవల నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ ఫర్నిచర్ దుకాణంలోనూ భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అర్ధరాత్రి ఘటన జరగడంతో ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఆస్తి నష్టం జరిగింది. సువిశాలమైన ప్రాంతంలో నిర్మాణం ఉన్నప్పటికీ ఫైర్ సేఫ్టీ ప్రమాణాలపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇలాంటి ఘటనలు మధ్యాహ్నం జరిగి ఉంటే షాపింగ్ కోసం వచ్చిన వారు బయట పడడం కష్టతరమైన పనిగా చాలా మంది భావిస్తున్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏటా ఉమ్మడి జిల్లాలో చిన్నా చితక అగ్ని ప్రమాదాలు అనేకం వెలుగు చూస్తున్నాయి. కనీస నిబంధనలను వ్యాపారులు పాటించడం లేదు. తద్వారా సామాన్య ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. అదృష్టవశాత్తు ఇప్పటి వరకు భారీ ఎత్తున ప్రాణ నష్టం వాటిల్లకపోయినప్పటికీ హైదరాబాద్‌లో ఈ మధ్య వెలుగు చూసిన గుల్జార్ హౌస్ ఘటనతోనైనా అగ్నిమాపక శాఖతో పాటుగా మిగిలిన శాఖలు తక్షణం కళ్లు తెరిచి ప్రజల రక్షణ కోసం నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



నిజామాబాద్ నగరంలో ఇటీవల ఓ ఫర్నిచర్ షాపులో జరిగిన ప్రమాదంలో మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)



**రోగుల భద్రత పట్టని ప్రైవేట్ దవాఖానలు**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడిలో ద్విచక్ర వాహనంపై తిరగడం ఒక సాహసం. అలాంటిది అనుకోని ఘటన ఏదైనా జరిగితే అగ్నిమాపక వాహనం చక్కర్లు కొట్టడం కష్టతరమైన పని. ఇరుకైన భవనాల్లో కార్పొరేట్, మల్టీ స్పెషాలిటీ పేరుతో అనేక దవాఖానలు వెలిశాయి. వీటిల్లో సరైన భద్రతా ప్రమాణాలు లేవు. అయినప్పటికీ వీటికి అనుమతులు మంజూరు కావడం వెనుక మతలబు ఏమిటనే దానిపై అనుమానాలు కలుగుతున్నాయి. ఫైర్ సేఫ్టీ అధికారులు సునిశితంగా పరిశీలించి ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంటుంది. ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీ లేకుండానే మున్సిపల్ కార్పొరేషన్, వైద్యారోగ్య శాఖల నుంచి ఎడాపెడా అనుమతులు జారీ అవుతున్నాయి. తద్వారా అనేక దవాఖానల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు భద్రత లేని భవనాల్లో కార్యకలాపాలకు యథేచ్ఛగా అనుమతులు ఇవ్వడం గమనార్హం.

ఇటీవల ఖలీల్‌వాడిలోని ఓ దవాఖానలో లిఫ్ట్ మొరాయిస్తే మెట్ల మార్గంలో రోగులను తరలించడం కష్టతరమైంది. కనీసం నడవడానికి కూడా మెట్లు సరిగా లేకపోవడంతో రోగులు, బంధువులు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. అదే దవాఖానలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రజల ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నకు సంబంధిత శాఖల వద్ద జవాబు లేకుండా పోయింది. ఓవైపు నగరపాలక సంస్థ అధికారులు, మరోవైపు అగ్నిమాపక శాఖ, వైద్యారోగ్య శాఖ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులంతా ప్రజల రక్షణకు ఆయా దవాఖానల యాజమాన్యాలతో రాజీ పడుతుండడమే ఈ దురవస్థకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇష్టారాజ్యంగా అనుమతులు జారీ కావడంతో దవాఖానలను ఏర్పాటు చేసి యాజమాన్యాలు రూ.లక్షల్లో ప్రజల నుంచి దోచుకుంటున్నారు. తీరా ఏదైనా ఘటన జరిగితే చేతులు ఎత్తేసి ఆయా శాఖలను మేనేజ్ చేసుకుంటూ తమకేమీ సంబంధం లేదన్నట్లుగా దులుపేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**దవాఖానల్లో తనిఖీలు చేస్తున్నాం..**

పోలీస్ కమిషనర్ ఆదేశాలతో ప్రస్తుతం ప్రైవేటు దవాఖానల్లో ప్రత్యేక బృందాల తనిఖీ కొనసాగుతున్నది. భవనం ఎత్తును అనుసరించి, నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు ఫైర్ సేఫ్టీ ఉందా? లేదా ? అనే కోణంలో పరిశీలిస్తున్నం. కొన్నింటికి ప్రమాణాలు ఉన్నట్లుగా భావిస్తున్నాం. లేని వాటిని గుర్తించి నోటీసులు జారీ చేస్తాం. డీఎంహెచ్‌వో ఇచ్చిన జాబితా ప్రకారం ఆయా దవాఖానలను తనిఖీ చేస్తున్నం. ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చూసేందుకు అప్రమత్తమయ్యాం. 15 మీటర్లు ఎత్తు ఉన్న బిల్డింగ్‌కు తప్పనిసరిగా ఎన్‌వోసీని అగ్నిమాపక శాఖ నుంచి తీసుకోవాల్సి ఉంటుంది.

– టి.పరమేశ్వర్, అగ్నిమాపక శాఖ అధికారి, నిజామాబాద్ జిల్లా

# కుట్రతోనే కేటీఆర్‌కు నోటీసులు

- రేవంత్‌రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్
- కాసుల కోసం జేసీబీ.. కేసుల కోసం ఏసీబీ
- ముఖ్యమంత్రే అంతులేని అవినీతి పరుడు
- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధ్వజం



ఖలీల్‌వాడి, జూన్13: కాంగ్రెస్ ప్రభుత్వం కాసుల కోసం జేసీబీని, ప్రత్యర్థులను అణచివేసేందుకు కేసుల కోసం ఏసీబీని ప్రయోగిస్తున్నదని బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆరోపించారు. కుట్రపూరితంగా కేటీఆర్‌కు ఏసీబీ ద్వారా నోటీసులు జారీ చేయించి కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసానందం పొందుతున్నదని ఓ ప్రకటనలో మండిపడ్డారు. అసలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే అంతులేని అవినీతి పరుడని ఆరోపించారు. 'కాంగ్రెస్ అంటేనే ఫాదర్ ఆఫ్ కరప్షన్ అని, ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా 'కరప్షన్' సెంటర్, పీసీసీ అంటే ప్రదేశ్ 'కరప్షన్' సెంటర్ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చరిత్రంతా ఏ టూ జడ్ స్కామ్‌లేనని గుర్తు చేశారు. నేషనల్ హెరాల్ పేరుతో రేవంత్‌రెడ్డి బుక్కిందెంత? హైడ్రా పేరుతో మెక్కిందెంత? అని నిప్పులు చెరిగారు. ఎలాంటి అవినీతి జరగని కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ వేశారని, విచారణ పేరుతో కేసీఆర్‌ను పేరుతో వేధిస్తున్నారని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ-ఫార్ములా కారు రేసింగ్‌లోనూ తప్పు జరిగినట్టు ఆధారాలు లేకున్నా ప్రజల పక్షాన పోరాడకుండా అడ్డుకోవాలనన్న దుష్టతలంపుతో ఏసీబీ చేత కేటీఆర్ కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. స్కామ్‌లు, పాలనా వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారని తెలిపారు. రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని జీవన్ రెడ్డి హెచ్చరించారు.

## ఎస్సారెస్పీకి 3,334 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూన్ 13: నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి శుక్రవారం 3,334 క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1063 అడుగులు (13.601టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నది. కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 341 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది.

# కాన్వకేషన్‌పై ముందడుగు

- టీయూ ఏర్పడిన నాటి నుంచి ఒకేసారి నిర్వహణ
- త్వరలో నిర్వహించేందుకు ఏర్పాట్లు



డిచ్‌పల్లి, జూన్ 13 : రాష్ట్రం పేరు మీద ఏర్పడిన తెలంగాణ యూనివర్సిటీలో ఆది నుంచి పాలనలో నిర్లక్ష్యం రాజ్యమేలుతున్నది. తెలంగాణ విశ్వవిద్యాలయం ఏర్పడి 18 సంవత్సరాలు అవుతుండగా..ఇప్పటివరకు ఒకేసారి స్నాతకోత్సవం (కాన్వకేషన్) నిర్వహించారు. వర్సిటీలో నిర్వహించే అతి పెద్ద పండుగ స్నాతకోత్సవం. పీజీలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేసి సత్కరించి ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయంలో ఏడాదికో సారి స్నాతకోత్సవం చేపట్టాలని యూజీసీ చెబుతోంది. కానీ తెలంగాణ యూనివర్సిటీలో ఈ 18 ఏండ్లలో ఒకసారి మాత్రమే నిర్వహించడం దురదృష్టకరం. నాలుగు నెలల క్రితం వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య టి.యాదగిరిరావు స్నాతకోత్సవం నిర్వహణకు తొలి ప్రాధాన్యమిస్తూ ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గతేడాది నవంబర్‌లో జారీ చేయించారు.

**రెండుసార్లు నోటిఫికేషన్ జారీ చేసినా..**

తెలంగాణ యూనివర్సిటీ 2006లో ఏర్పడగా తొలి స్నాతకోత్సవం 2013 నవంబర్ 13 లో అప్పటి వీసీ ఆచార్య అక్బర్‌అలీఖాన్ హయాంలో నిర్వహించారు. ఆ తర్వాత స్నాతకోత్సవం ఊసే లేదు. అనంతరం 2018లో అప్పటి వీసీ ఆచార్య సాంబయ్య, మళ్లీ 2020లో ఆనాటి వీసీ రవీందర్‌గుప్తా నోటిఫికేషన్ జారీ చేశారు. కానీ ఈ రెండుసార్లూ అమలుకు నోచుకోలేదు.

**దాతల ఔదార్యం**

పీజీ, పీహెచ్‌డీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేసేందుకు పదేండ్ల క్రితం అప్పటి వర్సిటీ అధికారులు దాతలను సంప్రదించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ హోదాల్లోని ప్రముఖులు, విద్యాసంస్థల అధిపతులు, స్వచ్ఛంద సేవకులు, రాజకీయ నేతలు ఆయా రంగాల్లోని వారు ముందుకొచ్చి రూ.33.80 లక్షలు విరాళంగా ఇవ్వగా వర్సిటీ అధికారులు బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ నగదుకు వడ్డీ రూపంలో వచ్చిన సొమ్ముతో వివిధ కోర్సుల్లో ప్రతిభ చాటిన 131 మందికి పతకాలు అందించేందుకు ఉన్నతాధికారులు వాటిని తయారు చేయించడంలో నిమగ్నమయ్యారు. అన్ని అనుకున్నట్లు జరిగితే జూలై మూడోవారంలో స్నాతకోత్సవం నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు ఇటీవల రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను స్వయంగా కలిసి స్నాతకోత్సవానికి రావాలని ఆహ్వానించారు.

**పండుగలా నిర్వహిస్తాం..**

వర్సిటీ ఏర్పాటైన నుంచి ఒకేసారి స్నాతకోత్సవం నిర్వహించినట్లు నేను బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెలిసింది. తొలి ప్రాధాన్య అంశాల్లో స్నాతకోత్సవం నిర్వహించడం ఒకటిగా పెట్టుకున్నాం. విద్యార్థులు, అధ్యాపకులను ప్రోత్సహించేందుకు స్నాతకోత్సవాన్ని పెద్దపండుగలా నిర్వహిస్తాం. గవర్నర్ అనుమతితో బంగారు పతకాలు తయారుచేయిస్తున్నాం. స్నాతకోత్సవం జూలై మూడో వారంలో నిర్వహించనున్నాం. ముఖ్యఅతిథిగా రావాలని గత సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను స్వయంగా కలిసి ఆహ్వానించాం. మిగతా అతిథుల వివరాలను త్వరలో తెలియజేస్తాం.

– టి.యాదగిరిరావు, వైస్ ఛాన్స్‌లర్



# బాలికల పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి

## బీబీపేటలో విద్యార్థినుల తల్లిదండ్రుల ధర్నా



బీబీపేటలో ధర్నా చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

బీబీపేట్, జూన్ 13: మండల కేంద్రంలో ఉన్న బాలిక ఉన్నత పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికల ఉన్నత పాఠశాలను బాలుర ఉన్నత పాఠశాలకు తరలించి, బాలికల ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డీఈవో ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఉత్తర్వులను వెనక్కి తీసుకొని, బాలికల పాఠశాలను అక్కడే యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

# 'స్వధార్ హోం' అస్తవ్యస్తం

- రెండేండ్లుగా ప్రభుత్వ అనుమతి లేకుండానే నిర్వహణ
- నిధుల వినియోగంలో అవకతవకలు!
- మానిటరింగ్ కమిటీ తనిఖీల్లో బట్టబయలు
- నిర్వాహకులపై ఆగ్రహం



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

వినాయక్‌నగర్, జూన్ 13: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గౌతమ్‌నగర్‌లో ఉన్న స్వధార్ హోమ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో రిడో అనే స్వచ్ఛంద సంస్థ స్వధార్ హోమ్‌ను నిర్వహిస్తున్నది. వివిధ నేరాలు, ఇతరత్ర సమస్యల్లో బాధితులైన మహిళలను ప్రభుత్వ సంస్థలు, న్యాయస్థానాలు స్వధార్ హోమ్‌కు పంపించి ఇక్కడ రక్షణ కల్పిస్తాయి. కానీ ఇక్కడ హోమ్‌లో మాత్రం సరైన రక్షణ ఏర్పాట్లు లేవని, నిధులను సద్వినియోగం చేయడంలేదనే ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో 2025 జనవరిలో కలెక్టర్ చైర్మన్‌గా, పోలీస్ కమిషనర్, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ, జిల్లా వెల్ఫేర్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్, స్వచ్ఛంద సేవ సంస్థతో మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఫిర్యాదుల నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్, అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ, స్నేహ సొసైటీ సిద్ధయ్యతో కలిసి శుక్రవారం స్వధార్ హోమ్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ అనుమతి లేకుండా రెండేండ్లుగా హోమ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. హోమ్‌లో ఎంత మంది బాధిత మహిళలు ఉన్నారు..ఎంత మంది ప్రవేశం పొందారనే వివరాలు సైతం లేకపోవడంతోపాటు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక నిధుల జమా ఖర్చుల లెక్కల రికార్డులు సైతం సరిగా లేవని, ప్రభుత్వ అనుమతి లేకుండా హోమ్ ఎలా నడుస్తుందని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

## జీజీహెచ్ ఆవరణలో ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి/వినాయక్‌నగర్, జూన్ 13: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ దవాఖాన (జీజీహెచ్) ఆవరణలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. ఘటనకు సంబంధించి వివరాలు.. జుక్కల్ మండలం మహ్మదాబాద్ గ్రామానికి చెందిన పొనుగంటి సాయిలు (37), తన భార్య సంగీతను ప్రసవానికి నిజామాబాద్ దవాఖానకు తీసుకువచ్చాడు. ఈనెల 6న బాలుడు పుట్టగా.. కొద్ది సేపటికే మృతి చెందాడు. దీనికి తోడు సంగీత పల్స్‌రేట్ పడిపోవడంతో వైద్యులు ఆమెకు చికిత్స అందించసాగారు. పుట్టిన బిడ్డ చనిపోవడం, భార్య దవాఖానలో ఉన్నా తన వద్ద డబ్బులు లేకపోవడం, ఇప్పటికే చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపంతో సాయిలు గురువారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.